


# టచ్ మీ నాట్

**ఆంధ్రప్రభ** వారపత్రికలో గగనసీమ సీరియల్ పూర్తయ్యాక దాని ఎడిటర్ శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ మరో సీరియల్‌ని అడిగారు. ఎందుకంటే టి.వి ప్రాచుర్యంలోకి వస్తున్నా ఇంకా పాఠకులు సీరియల్స్‌ని ముమ్మరంగా చదివే రోజులవి. ఆ రోజుల్లో పాఠకుల చేత చదివించే నవలలు రాసేవాళ్ళు చాలా తక్కువమంది ఉండటం వల్ల కొందరినే అడిగి రాయించేవారు.




టచ్ మీ నాట్ ఇతివృత్తం చెప్పగానే అప్పటి అసోసియేట్ ఎడిటర్ శ్రీ రమణగారు అది సినిమా కథలా ఉందని పెదవి విరిచారు. కానీ శర్మగారి కామెంట్ నాకు గుర్తుంది.

"నాకు నచ్చింది. మధ్య తరగతి కుటుంబ కథ. మన పాఠకులు వాళ్ళే. ఇలాంటి ఇతివృత్తంగల నవలలు ఇంతకు మునుపు రాలేదు. కాబట్టి కొత్తదనం ఉంది. పైగా సస్పెన్స్ ఉంది."

శ్రీ రమణగారు చెప్పింది కొంతదాకా నిజమే. గతాన్ని మర్చిపోవడం నేపథ్యంలో ప్రేమ లేదా క్రైం కథా సినిమాలు తెలుగులో చాలా వచ్చాయి. వాటి మాతృకలని కూడా నేను ఇంగ్లీష్‌లో చూసాను. కానీ అమ్నీషియా వల్ల కుటుంబంలో కలిగే సమస్యలతో అంతదాకా సినిమా రాలేదు.

దీనికి ప్రేరణ నేషనల్ ఎంక్వైరర్ అనే అమెరికన్ వారపత్రికలో వచ్చిన ఓ వార్త. గతం మరిచిపోయిన ఓ భార్య గురించి రాస్తూ ఆమె భర్త, పిల్లలతో మినీ ఇంటర్వ్యూని ప్రచురించారు.

హీరోయిన్ పల్లవి అన్నతో స్కూటర్ మీద వెళ్తూండగా జరిగిన రోడ్ ప్రమాదంలో కోమాలోకి వెళ్ళి, బయటకి రావడంతో కథ ఆరంభం అవుతుంది. హాస్పిటల్లో మెలుకువ వచ్చిన ఆమె అద్దంలో తన మొహాన్ని గుర్తుపట్టలేదు. తనెవరో, తన పేరేమిటో, తన వాళ్ళెవరో మర్చిపోతుంది. మెదడులోని కుడి హెమిస్ఫియర్‌లో మనిషి వ్యక్తిగత సమాచారం పొందుపరిచి ఉంటుంది అక్కడి కొన్ని సెల్స్

అచేతనం అవడంతో తన వ్యక్తిగత జీవితానికి చెందిన చాలా వాటిని మర్చిపోతుంది. కొంత తాత్కాలిక సమాచారం, కొంత శాశ్వత సమాచారం మర్చిపోయి తన భర్త రాజేంద్రని పరాయి పురుషుడిగా భావించడంతో భార్యగా మసలుకోలేకపోతుంది. 'టచ్ మీ నాట్.. నేను చెప్పేదాకా' అని దూరం పెడుతుంది. కొడుకులు అమిత్, సుమిత్‌ల మీద సహజ మాతృప్రేమని చూపించలేకపోతుంది. అంకెలు గుర్తు పట్టగలదు కానీ అక్షరాలని మర్చిపోవడంతో కొడుకు దగ్గర ఏబిసిడిలని నేర్చుకుంటుంది.

క్రమంగా తన గత జీవితం గురించి అనేక మంది చెప్తూంటే తనెంత ప్రతికూల వ్యక్తో తెలిసి ఆశ్చర్యపోతుంది. ఉద్యోగంలో చేరడంతో, స్వంత సంపాదన ఇచ్చిన ధైర్యంతో అప్పటికే తన భర్త రాజేంద్రనించి విడాకుల కోసం కోర్టుకి వెళ్ళిందని, తీర్పు తర్వాతి వాయిదాలో రావచ్చని తెలుస్తుంది. పల్లవి తండ్రికి ఆమె స్వభావం నచ్చదు. ప్రమాదం తర్వాత పల్లవి సాత్వికంగా మారడంతో ఆయన సంతోషిస్తాడు.

ఆమె బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు ద్వారా గతంలో తన గురించిన వివరాలు తెలుసుకుంటుంది. కానీ జ్ఞాపకాలు తిరిగిరావు. అవి కొన్ని కఠినమైనవి, కొన్ని హాస్యమైనవి, కొన్ని ఆమె మనసులో బలంగా నాటుకున్నవి. ఓ రాత్రి ఆమె ఓ శవంతో ఒంటరిగా ఓ గదిలో గడిపింది. కానీ గుర్తులేదు. మంకుపట్టు, అహంకారం, ఎదుటి వారి అభిప్రాయాలని గౌరవించకపోవడం వల్ల మౌలికమైన మానవ సంబంధాల విషయంలో తను మూర్ఖంగా ప్రవర్తించినట్లు తెలిసి ఆశ్చర్యపోతుంది. తిరగమోతలో సెనగ బద్దలు వేయవద్దని, అవి పళ్ళకిందకి వస్తే తనకి అసౌకర్యం అని, తన తల్లి వాటిని వేసేది కాదని రాజేంద్ర కోరితే పంతం కొద్దీ పల్లవి వాటిని వేయడం ఓ చిన్న ఉదాహరణ.

భార్యతో విసిగిపోయిన రాజేంద్ర మహిత అనే పెళ్ళైన మహిళకి దగ్గరవుతాడు. కారణం మహిత భర్త. అతను తన సంపాదని తన కోసం తప్ప కుటుంబం కోసం ఖర్చు చేయడు. 'నేను పుట్టింది నాకోసం. పిల్లల కోసం కాదు. మగాడి మొహంలో పుట్టే వెంట్రుకలని గీయకపోతే అసౌకర్యం. ఇలాగే మగాడిలో ఓ చోట పుట్టే ద్రవం ఏదో పద్ధతిలో బయటకి వెళ్ళకపోతే కూడా అసౌకర్యమే. డబ్బున్నప్పుడు హస్తప్రయోగ ఖర్మెందుకు?' అని ఓ సందర్భంలో అతను రాజేంద్రకి చెప్తాడు. అంతటి స్వార్థపరుడు. ఏభై రూపాయల కిళ్ళీ కొనుక్కుని తిని కూతురికి టెక్స్ట్ పుస్తకం కొనడు. జీతం రాగానే అది ఖర్చయ్యేదాకా మాయమై తర్వాత ఇంటికి తిరిగి వస్తాడు. నాకు ఇలాంటి వ్యక్తితో పరిచయం కాబట్టి ఈ పాత్రని మలిచాను.

రాజేంద్ర తనని శారీరకంగా ఆశిస్తున్నాడని తెలిసిన మహిత అందుకోసం 'నెలకింత' అని ఇవ్వమని కోరుతుంది. మహిత పాత్ర కూడా ఊహించి రాసిన పాత్రకాదు.

పల్లవిని విడాకులకి ప్రోత్సహించిన ఆమె బాస్ రాంషా ఓ చెడ్డ పాత్ర. నాకు అలాంటి పాత్ర అప్పట్లో తెలుసు. విబూది, పైన ఎర్రబొట్టు పెట్టుకుని పరమ పవిత్రంగా కనిపించే అతనికి వరస కాని కజిన్‌తో సంబంధం ఉండేది. రాంషాని ఆ వ్యక్తి రోల్‌మోడల్‌గా తీసుకుని రాసాను.

కొద్దికాలం తన కుటుంబంతో గడిపాక పల్లవి ఎడ్జస్ట్ అవుతుంది. వాళ్ళంతా తిరుమలకి వెంకన్నని దర్శించుకోడానికి వెళ్తారు. అక్కడ పల్లవి కాలుజారి పడి తలకి దెబ్బ తగిలి పూర్వస్మృతి వస్తుంది. ఆమె పూర్వపు పల్లవిగా ప్రవర్తిస్తుందా? లేక ప్రస్తుత పల్లవిలానా? అనే ప్రశ్నతో నవలని ముగించాలని అనుకున్నాను. కానీ ఆఖరి సంచిక చదివాక శ్రీరమణగారు స్పష్టత కావాలని ఫోన్ చేయడంతో, చివర్లో ఆమె గతంలోని పల్లవిలా నటించి ఇటు పాఠకులని, అటు పాత్రలని ఫూల్ చేసాక తనకి గతం గుర్తొచ్చినా వర్తమానంలో నేర్చుకున్న పాఠాల వల్ల మారానని చెప్పినట్లు మార్చాను.

ఇది రాయడానికి నేనా నవలని చదివాక రచయితగా నేను గొప్పగా అపజయం పొందానని అర్థమైంది. చివరిదాకా ఆమె గతం గురించి తెలుసుకోవడమే తప్ప కథలో ఎలాంటి మలుపులు లేవు. ఆనాటి పాఠకులకి కొంతదాకా ఫర్వాలేదు కాని కొంత చదివాక నేటి పాఠకుడికి విసుగుపుట్టచ్చు. ఐతే గతంలో జరిగిన సంఘటనల్లో చాలా భాగం శక్తివంతమైనవి కాబట్టి ఆసక్తిగా సాగింది. ఉదాహరణకి

ఆఫ్రికన్ అనాగరికులు ఓ జంతువుని చంపి పాతిపెడతారు. దాని మాంసాన్ని పురుగులు తింటాయి. మాంసం మొత్తం అయిపోయాక ఓ పురుగుని మరో పురుగు తింటుంది. ఇలా లక్షలాది పురుగులన్నీ ఆహారం అయ్యాక చివరికి రెండు పురుగులు మిగులుతాయి. ఓ పురుగుని ఇంకోటి తిన్న మర్నాడు వాళ్ళు మళ్ళీ గొయ్యి తవ్వి ఆ పురుగుని పట్టుకుని వండుకుని తింటారు. అది ఆ బ్రెడ్ సైజుకి ఎదిగి ఉంటుంది.

ఇందులో పల్లవి స్వంత ఆలోచనలన్నీ ఫస్ట్ పర్సన్‌లో, జరిగే కథ థర్డ్ పర్సన్‌లో రాసాను. ఐతే ఆ టెక్నిక్ ఈ నవల్లో అంతగా ఇమడలేదని అనిపించింది. మే 1997లో దీన్ని లిపి పబ్లికేషన్స్ సంస్థ పుస్తకంగా వెలువరించింది. 254 పేజీలు వెల రూ.50/- పునర్ముద్రణ వెలువడలేదు. కన్నడంలో డైరెక్ట్ పుస్తకంగా వచ్చింది.

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*